క్లుప్తంగా

కొత్వాల్‌గూడలో నో ప్లాస్టిక్ ర్యాలీ



కొత్వాల్‌గూడలో ర్యాలీలో హోమియో కాలేజీ విద్యార్థులు

శంషాబాద్: ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని ముచ్చింతల్‌లోని జిమ్స్ హోమియోపతి కళాశాల విద్యార్థులు మంగళవారం పట్టణంలోని కొత్వాల్‌గూడలో నో ప్లాస్టిక్ పేరిట ర్యాలీ నిర్వహించారు. దుకాణాలు, ఇతర అవసరాలకు బట్ట సంచులు వినియోగించాలన్నారు. ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలను బస్తీ వాసులకు వివరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానేస్తే పర్యావరణ హితంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జిమ్స్ కళాశాల ప్రొఫెసర్ పూనమ్ సూతర్, స్థానిక కౌన్సిలర్ లక్ష్మీ శ్రీనివాస్‌గౌడ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



హరికిషోర్ 215వ ర్యాంకు



మల్లీశ్వరి 481వ ర్యాంకు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ భవానీ కాలనీలోని శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఎల్.హరికిషోర్ ఆల్ ఇండియా 215 ర్యాంకు సాధించాడు. నీట్ విభాగంలో జి.మల్లేశ్వరి 481వ ర్యాంకుతో సత్తాచాటారు. జేఈఈ మెయిన్స్ విభాగంలో వి.విజయ్‌కుమార్ 487వ ర్యాంకు, నందకిషోర్‌రెడ్డి 1014వ ర్యాంకు సాధించారు. ఉత్తమ ప్రతిభకనబరిచి ఆల్ ఇండియా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఎస్.శ్రీనివాస్ రెడ్డి, సిహెచ్.శ్రీనివాస్‌చారీ, అధ్యాపక బృందం అభినందించారు.

కట్టమైసమ్మ ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ టీచర్స్ కాలనీలోని కట్ట మైసమ్మ దేవాలయ ద్వితీయ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దేవాలయాన్ని వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ తాళ్లపాక సత్యానారాయణశర్మ నేతృత్వంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పూజలు, హోమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి విశేష పూజలు చేశారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నియోజకవర్గానికి ఏం ఇచ్చారు..?



ముఖ్యమంత్రి మాట్లాడిన వీడియో క్లిప్ చూపిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గానికి ఒక్కపైసా మంజూరు చేయలేదని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం కాటేదాన్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో సైతం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి తన ప్రత్యేక నిధుల నుంచి పది కోట్లు మంజూరు చేస్తానని నేటికి నయాపైసా మంజూరు చేయలేదన్నారు. 9 సంవత్సరాలుగా కేవలం రూ.1.37 కోట్లను మాత్రమే ఎస్‌డీఎఫ్ నుంచి మంజూరయ్యాయని ఆర్‌టీఏ యాక్టు ద్వారా అధికారులు సమాధానం ఇచ్చారన్నారు. ఇదే విషయాన్ని తాను ఎవరిదీ అసమర్థత పేరిట హోర్డింగ్‌లు, వాల్ పోస్టర్లు ఏర్పాటు చేశానని గుర్తు చేశారు.

అక్షరాభ్యాసం

శంషాబాద్ రూరల్: ఘాంసిమియాగూడ అంగన్‌వాడీ కేంద్రంలో బడి బాట సందర్భంగా చిన్నారుల చేత సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా విద్యా దినోత్సవం

రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. శివరాంపల్లి, రాజేంద్రనగర్, బుద్వేల్ పాఠశాలల్లో డిజిటల్ తరగతులను ప్రారంభించడంతో పాటు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతులను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ నాయకుడు మజ్జిగ నరేష్‌యాదవ్, పచ్చ శ్రీనివాస్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడలో ..

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంగళవారం విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గంధంగూడలోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీలో మేయర్ మహేందర్‌గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మైనార్టీ రెసిడెన్షియల్‌లలో మెరుగైన సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తలారి చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షులు సురేష్‌గౌడ్, పాఠశాల ప్రిన్సిపల్ రాధిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు చక్కగా చదువుకోవాలి.

విద్యార్థులు చక్కగా చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం 7వ డివిజన్‌లోని పిఅండ్‌టి బీ–బ్లాక్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నూతన విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. నోటు, పాఠ్య పుస్తకాలను, యూనిఫామ్‌లను అందజేశారు .కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షులు సురేష్‌గౌడ్, కార్పొరేటర్ పద్మావతి పాపయ్యయాదవ్, షఫీయుద్దీన్, నదీమ్, హఫీజ్‌ఖాన్, రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కోకాపేటలో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



మణికొండ క్వార్టర్స్‌లో విద్యార్థులకు డ్రస్‌లను అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్ తదితరులు

శంషాబాద్ రూరల్: మండలంలోని పెద్దషాపూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన ఊరు– మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలకు అధిక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులు, డిజిటల్ క్లాసులను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, యూనిఫాం, ఉచిత బస్ పాసులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు చంద్రశేఖర్, ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వీరాజు, ఎంపీటీసీ చెక్కల ఎల్లయ్య, ఎంఈఓ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్‌లో ..

అత్తాపూర్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన విద్యా దినోత్సవంలో అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్, నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.సాయిప్రసాద్‌రావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎం.సురేందర్‌రెడ్డి, ముకేష్, శ్రీధర్‌రెడ్డి, మహేష్, రవి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

ఏజీవర్సిటీ: విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని, కేవలం ఉద్యోగం కోసమే చదవాలనే భావన వీడాలని కళాశాల డీన్ డాక్టర్ చీనానాయక్ అన్నారు.దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ అధికారి వెంకటేశ్వర్లు, శ్రీరాములు బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు పెద్దపీట

మణికొండ: ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసి, విద్యావ్యాప్తికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం మన ఊరు–మన బడి కార్యక్రమం కోకాపేట ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల భవనం, అదనపు తరగతులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, కమిషనర్ ఎ.సత్యబాబు, కౌన్సిలర్‌లు జి.శివారెడ్డి, దుర్గేష్‌యాదవ్, శ్రీకాంత్‌రావు, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు ఆర్.నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మణికొండలో...

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాలలో చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. డిజిటల్ క్లాస్ రూమ్‌లను ప్రారంభించి, విద్యార్థులకు డ్రస్‌లు, నోటు పుస్తకాలు అందజేశారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్



ఏజీ వర్సిటీలో మాట్లాడుతున్న డీన్



డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అర్చన

సౌకర్యాల కల్పనకు కృషి



గగన్‌పహాడ్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు బుద్వేల్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో చిరు వ్యాపారులు, స్ట్రీట్ వెండర్లను వ్యాపారాలు చేయొద్దని అధికారులు బెదిరిస్తున్నారని కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా వ్యాపారులను ఇబ్బందులు పెట్టకుండా యథావిధిగా నిర్వహించుకునేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ బల్వంత్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, తలారి చిన్న, పాండుయాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి

అత్తాపూర్: బీజేపీ నేతలు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ అధ్యక్షతన అత్తాపూర్ డివిజన్ శక్తికేంద్రాల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ శక్తికేంద్రాల ఇన్‌చార్జ్‌లకు దిశానిర్దేశం చేసేందుకు ఈ సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. మండల, డివిజన్, మున్సిపల్, కార్పొరేషన్ సమావేశాలను తేదీల ప్రకారంగా జూన్ 21వ తేదీ నుంచి జూలై 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. అత్తాపూర్ డివిజన్ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా బాలకృష్ణ, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా విశాల్ ఠాకూర్‌లను ఎన్నుకున్నారు .కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు సత్యనారాయణముదిరాజ్, రాచూరి రాజశేఖర్, కాడెం సుధాకర్, నల్లింగ్ రమేష్, జయానంద్‌రెడ్డి, సులిగె వెంకటేష్, రాజుపైల్వాన్, సాయియదవ్, మణికంఠ, రఘు, శంకర్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.



ఓబీసీ మోర్చా నాయకులకు నియామకపత్రాలు అందజేస్తున్న మల్లారెడ్డి

సందడిగా గౌడ్‌ల వనభోజనం



శంషాబాద్: పట్టణంలోని తొండుపల్లి, ఊటపల్లికి చెందిన గౌడ కుటుంబాలు స్థానికంగా ఉన్న అటవీ ప్రాంతంలో మంగళవారం వనభోజనాలు చేశారు. పదుల సంఖ్యలో కుటుంబాలు సరదాగా గడిపాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పారెపల్లి అంజయ్యగౌడ్, పోలంపల్లి యాదయ్యగౌడ్, కోమగంటి అంజయ్యగౌడ్, కొండ శేఖర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు శివలీల నర్సింహాగౌడ్, గౌడ సంఘం నాయకులు రాజుగౌడ్, దేవానంద్‌గౌడ్, కౌన్సిలర్ కొండ ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్ల ఫీజుల దోపిడీని అరికట్టాలి

శంషాబాద్: ప్రైవేటు స్కూళ్ల ఫీజుల దోపిడీని అరికట్టాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రైవేటు స్కూళ్ల ఫీజులను సర్కారు నియంత్రించకపోవడంతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నాయన్నారు. వేలకు వేలు ఫీజులు కట్టలేక మధ్యతరగతి వర్గాలు సతమతమవుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పడిపోవడంతో ప్రజలు ప్రయివేటుకు మొగ్గు చూపుతున్నారన్నారు. ఈ దోపిడీపై విద్యాశాఖ స్పందించకపోతే బీజేవైఎం ఆయా విద్యాసంస్థలపై దాడులు చేస్తుందని హెచ్చరించారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



అత్తాపూర్: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్సై కె.ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే 294 పిల్లర్ వద్ద 30 సంవత్సరాల యువకుడు మృతి చెందినట్లు సమాచారం అందిందన్నారు. మృతుడి వివరాల కోసం స్థానికంగా వాకబు చేయగా ఎలాంటి సమాచారం అందలేదు. దీంతో మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే అత్తాపూర్ పోలీసులను గానీ, ఉస్మానియా ఆసుపత్రి సిబ్బందిని సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హుక్కా సెంటర్‌పై దాడి

రాజేంద్రనగర్: అర్ధరాత్రి వరకు నిర్వహిస్తున్న హుక్కా సెంటర్‌పై రాజేంద్రనగర్ ఎస్‌ఓటి పోలీసులు సోమవారం అర్ధరాత్రి దాడి చేశారు. నిర్వాహకులతో పాటు 15 మంది యువకులను అదుపులోకి తీసుకుని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీకి చెందిన అయాన్(30) దుర్గానగర్ వద్ద హుక్కా సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. రాత్రి 11 గంటల వరకు మాత్రమే ఈ సెంటర్ నిర్వహించేందుకు అనుమతులు ఉన్నాయి. కానీ అయాన్ తెల్లవారుజాము వరకు నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఓటి పోలీసులు సోమవారం అర్ధరాత్రి 1.30 గటల ప్రాంతంలో హుక్కా సెంటర్‌పై దాడి చేసి నిర్వాహకుడు అయాన్‌తో పాటు 15 మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఫంక్షన్‌కు వచ్చి.. లారీ ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన ముస్తాక్

శంషాబాద్ రూరల్: శుభకార్యానికి వచ్చి రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా కోహీర్ ప్రాంతం షేక్‌వాడా కాలనీ వాసి మహ్మద్ ముస్తాక్(29) ఈ నెల 18న ఘాంసిమియాగూడలోని తన బావ సత్తార్ ఇంట్లో ఫంక్షన్‌కు వచ్చాడు. మంగళవారం ఉదయం టీ తాగేందుకు ఘాంసిమియాగూడ నుంచి గండిగూడ వరకు నడుచుకుంటూ వచ్చి జాతీయ రహదారి దాటుతుండగా షాద్‌నగర్ నుంచి శంషాబాద్ వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన ముస్తాక్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పశువులను తరలిస్తున్న వాహనాల పట్టివేత

శంషాబాద్ రూరల్: పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను స్థానికుల సహాయంతో పోలీసులు పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కోస్గి నుంచి నార్సింగ్‌కు డీసీఎం, బొలేరో వాహనాల్లో 14 పశువులను తరలిస్తున్నారు. పెద్దషాపూర్ శివారులో బెంగళూరు జాతీయ రహదారిపై వీటిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వాహనాలు, పశువులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా.. పశువులు తరలిస్తున్న తమ వాహనాలను కొందరు వ్యక్తులు ఆపి భయపెట్టారని డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉన్నత లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలి



మేనేజ్‌లో నూతన విద్యార్థులతో అధ్యాపకులు

ఏజీవర్సిటీ: విద్యార్థులు ఉన్నత లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించాలని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని 'మేనేజ్'లో 19 రాష్ట్రాలకు చెందిన 100 మంది విద్యార్థులతో 2023–24 పోస్టు గ్రాడ్యుయేట్ బ్యాచ్‌ను ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా 48 విశ్వవిద్యాలయాల నుంచి విద్యార్థులు ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. దేశంలో అగ్రి బిజినెస్ ఎడ్యుకేషన్‌లో మేనేజ్ అగ్రగామిగా ఉందని, 27 ఏళ్లుగా విద్యార్థులకు 100 శాతం ప్లేస్‌మెంట్‌ను అందిస్తోందన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ అభిరుచులను వారి జీవిత లక్ష్యాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌రెడ్డి పీసీ సీజీడీఎం శ్రీకాంత్, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దేశంలో వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రధాన సమస్య



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఏజీవర్సిటీ: దేశంలోని ప్రధాన నగరాల్లో వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రధాన సవాలుగా మారిందని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్ అన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండల, జాతీయ వ్యవసాయ ఉన్నత విధాయ పథకం సహకారంతో చేపడుతున్న వేస్ట్ టు వెల్త్ పథకం స్టేక్ హోల్డర్ సమావేశం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి అగర్వాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో 13 లక్ష్యాలను ఈ ప్రాజెక్టులో భాగంగా అమలుపరచడం అభినందనీయమన్నారు. ఈ ప్రాజెక్ట్ కాలపరిమితి ముగిసిన తర్వాత కూడా కొనసాగించే విధంగా వివిధ సంస్థలు నగరపాలక సంస్థలతో అనుసంధానించాలని సూచించారు. విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రవీణ్‌రావు మాట్లాడుతూ.. సమాజ అవసరాలను తీర్చే విధంగా పరిశోధన ఉండాలని, వృథాను అరికట్టడంతో సంపద సృష్టించినట్లవుతుందని అందుకు సమర్థ యాజమాన్య పద్ధతులు అవసరమన్నారు. వ్యవసాయ కళాశాల క్షేత్రంలో ఏర్పాటు చేసిన బ్లాక్ సోల్జర్ ఫ్లై బ్రీడింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.